సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 23 । జూలై । 2024



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 1,337 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.47

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.47, కనిష్టంగా రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో తుంపర్లు పడ్డాయి. గంటకు 10 నుంచి 16 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం



ఎస్పీ రత్నకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్‌: పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ రత్న అన్నారు. సోమవారం పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్పీగా ఇటీవలే బాధ్యతలు చేపట్టి సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో పోలీసుల సంక్షేమం కోసం తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సిబ్బందికి ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలవ వచ్చన్నారు. ఎస్పీని కలిసిన వారిలో పోలీసులు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, హరినాథ్, తేజ్‌పాల్, లక్ష్మీనారాయణ, దాదాపీర్ ఉన్నారు.

మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి



సెబ్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్‌: మద్యం, నాటుసారా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ రత్న సెబ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సెబ్ అధికారులు ఇటీవలే ఎస్పీగా భాద్యతలు చేపట్టిన రత్నను ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ.. జిల్లాలో పనిచేస్తున్న సెబ్ అధికారులు వివరాలు, పనితీరు అడిగి తెలుసుకున్నారు. గంజాయి, లిక్కర్, నాటుసారా, తదితర అసాంఘిక కార్యాకలాపాలపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో పూర్తిగా నిషేధించేందుకు కృషి చేయాలని సెబ్ అధికారులకు సూచించారు. ఎస్పీని కలిసిన వారిలో అదనపు ఎస్పీ విష్ణు, సెబ్ ఏఎస్పీ సుబ్రహ్మణ్యంతో పాటు సిబ్బంది పాల్గొన్నారు

జెడ్పీ చైర్‌పర్సన్ గన్‌మెన్ల తొలగింపు

అనంతపురం సిటీ: జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు గన్‌మెన్లను రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. జెడ్పీ చైర్‌పర్సన్లకు 1+ 1 గన్‌మెన్లను గత ప్రభుత్వం కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ప్రభుత్వ ఆదేశాల మేరకు జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఇంత వరకు గన్‌మెన్లుగా వ్యవహరించిన పోలీసులు తమ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. కేబినెట్ హోదా కలిగిన జెడ్పీ చైర్‌పర్సన్‌కు గన్‌మెన్లను తొలగించడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

37 ఏళ్ల క్రితం కేసు... నిందితుడి అరెస్ట్



నిందితుడు అంజినప్ప

నల్లమాడ: ఓ కేసులో నిందితుడిని పోలీసులు 37 ఏళ్ల తర్వాత అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. నల్లమాడ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని వేళ్లమద్ది గ్రామ పంచాయతీ పుటకప్పకొట్టాలలో 1987లో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి 17 మందిని నిందితులుగా గుర్తించి అప్పట్లో పోలీసులు వారిపై వివిధ సెక్షన్ల కింద కేసు (నెం.50/1987) నమోదు చేశారు. 1988లో చార్జిషీట్ కూడా దాఖలు చేశారు. ఈ కేసులో 16వ నిందితుడిగా ఉన్న అంజినప్ప అప్పటి నుంచి పరారీలో ఉండటంతో... పోలీసులు నాన్‌బెయిల్ వారెంట్ కూడా జారీ చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో 1999లో లాంగ్ పెండింగ్ కేసుగా రికార్డుల్లో నమోదు చేశారు. ఇటీవల లాంగ్ పెండింగ్ కేసులపై దృష్టి సారించిన పోలీసులు... 1987లో పుటకప్పకొట్టాలలో జరిగిన ఘర్షణ కేసుపై దృష్టి సారించారు. ఈ క్రమంలో నిందితుడు అంజినప్ప వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఉన్నట్లు సమాచారం అందడంతో సోమవారం సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్‌ఐ రమేష్‌బాబు తమ సిబ్బందితో వెళ్లి నిందితున్ని అరెస్ట్ చేశారు. అనంతరం కదిరి కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి ఆగస్టు 5వ తేదీ వరకూ రిమాండ్ విధించారు.

ఆశలు ఫలించేనా?





- అసెంబ్లీ సమావేశాలపై జిల్లా వాసుల ఆశలు
- 'కూటమి' మేనిఫెస్టోపై స్పష్టతకు డిమాండ్
- పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపాలని మేధావుల సూచన
- సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వినతి
- వాణి బలంగా వినిపించాలని శాసనసభ్యులకు అన్ని వర్గాల విజ్ఞప్తి

సాక్షి, పుట్టపర్తి

శ్రీసత్యసాయి... నూతనంగా ఆవిర్భవించిన జిల్లా. అన్ని రంగాల్లో నిలదొక్కుకుని అభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వం కాస్త ఎక్కువ శ్రద్ధ చూపాల్సి ఉంటుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లాను ఏర్పాటు చేయడంతో పాటు నిధులూ దండిగా కేటాయించి అండగా నిలిచింది. ప్రస్తుతం రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం కూడా శ్రీసత్యసాయి జిల్లాకు ఆర్థికంగా అండగా నిలవాలని జనం కోరుతున్నారు. ఈ క్రమంలో తాజా అసెంబ్లీ సమావేశాలను ఆసక్తిగా గమనిస్తున్నారు. పథకాలపై స్పష్టతనివ్వాలని, జిల్లాలో నెలకొన్న సమస్యలపై జిల్లా మంత్రులు, శాసనసభ్యులు గళమెత్తాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా ప్రజల ఆశయాలు, ఆకాంక్షలు నెరవేర్చాలని కోరుతున్నారు.

ఆస్పత్రుల్లో సేవలు మెరుగుపర్చాలి

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఏ ఆస్పత్రి చూసినా రోగులతో కిటకిటలాడుతోంది. రోగులకు అనుగుణంగా వైద్య సేవలు లేవని జనం వాపోతున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జిల్లాలోని ఆస్పత్రుల సమస్యలను సమావేశాల్లో ప్రస్తావించి మెరుగైన సౌకర్యాలు కల్పనకు కృషి చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు. హిందూపురంలోని జిల్లా ఆస్పత్రి, ధర్మవరం, కదిరిలోని ఏరియా ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందించే దిశగా సభలో ప్రస్తావిస్తే బాగుంటుందంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెనుకొండలో ప్రారంభించిన మెడికల్ కళాశాలను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు మంత్రి కృషి చేయాలంటున్నారు.

చేనేతలకు న్యాయం చేయాలి..

జిల్లాలోని పెనుకొండ, హిందూపురం, ధర్మవరం నియోజకవర్గాల్లో వేల సంఖ్యలో చేనేతలు ఉన్నారు. గత ప్రభుత్వం ప్రతి ఏటా 'నేతన్న నేస్తం' కింద మరమగ్గాల నిర్వాహకులకు రూ.24 వేలు చొప్పున ఇచ్చేది. ప్రస్తుతం ఆ పథకం లేదు. చేనేత జౌళి శాఖ మంత్రి సవిత స్పందించి.. మగ్గాల నిర్వాహకులకు ఆర్థికంగా భరోసా ఇచ్చే విషయమై సభలో ప్రస్తావిస్తే బాగుంటుందని చేనేతలు కోరుతున్నారు. ఇక సవిత ప్రాతినిధ్యం వహిస్తోన్న బీసీ సంక్షేమ శాఖలో హాస్టళ్ల నిర్వహణ విషయంలో చాలా సమస్యలు వెంటాడుతున్నాయి. కొత్త భవనాల నిర్మాణంతో పాటు నిర్వహణలో లోటుపాట్లు రాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం జిల్లాలోని హాస్టళ్ల పరిస్థితిని అసెంబ్లీలో ప్రస్తావించి నిధులు దండిగా మంజూరయ్యేలా చూడాలని జనం కోరుతున్నారు.

చిత్రావతి నది ప్రక్షాళనపై స్పందించాలి..

జిల్లా కేంద్రం పుట్టపర్తికి ఆనుకుని ఉన్న చిత్రావతి నదిలో డ్రైనేజీ నీరు కలవడం కారణంగా కలుషితమవుతోంది. డ్రైనేజీ నీరు కలవకుండా.. ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. లేదంటే నదీ ప్రక్షాళనకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర సభలో మాట్లాడి.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తే బాగుంటుందని సాయిబాబా భక్తులు కోరుతున్నారు. హిందూపురంలో పారిశ్రామికవాడను మరింత అభివృద్ధి చేసే దిశగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కృషి చేయాలని, ఈ మేరకు అసెంబ్లీలో తన గళం విప్పాలని ప్రజలు ఆశిస్తున్నారు.

రైతుకు మేలు జరగాలి..

జిల్లా రైతులకు మేలు జరిగేలా అందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళం విప్పాలని జిల్లా వాసులు కోరుకుంటున్నారు. ముఖ్యంగా హంద్రీనీవా ద్వారా జిల్లాలోని చెరువులన్నింటికీ నీరిచ్చే అంశాన్ని సభలో ప్రస్తావించాలని, ఎన్నికల హామీ మేరకు రైతు భరోసా కింద ప్రతి రైతుకు రూ.20 వేలు వెంటనే ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలంటున్నారు.

రైతు భరోసా ఇవ్వాలి..



ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే సమయానికి గత ప్రభుత్వం రైతు భరోసా కింద నగదు ఇచ్చేది. కూటమి ప్రభుత్వం ఇంత వరకూ రైతులకు నగదు ఇవ్వలేదు. రైతులు పెట్టుబడికి డబ్బు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకుని ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా కింద రూ.20 వేలు ఇవ్వాలి. ఈ అంశాన్ని మంత్రి సత్యకుమార్ అసెంబ్లీలో ప్రస్తావించి రైతుకు మేలు జరిగేలా చూడాలి.

– భాస్కరరెడ్డి, అప్పరాచెరువు, బత్తలపల్లి మండలం

చెరువులన్నింటికీ నీరివ్వాలి



హంద్రీనీవా కాలువను పూర్తిస్థాయిలో పటిష్టం చేసి పూర్తి స్థాయిలో సాగునీటిని అందించాలి. రైతులకు ఎంతో మేలు చేసే ఈ అంశాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీ ప్రస్తావించి నీటి కోటాయింపులపై జీఓ తీసుకురావాలి. సాగునీటి కాలువలను మరింత పటిష్టం చేసి నియోజకవర్గంలోని అన్ని చెరువులను నీటితో నింపి ప్రజలకు సాగు, తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి.

– గౌస్‌అహ్మద్, సంతేబిదనూర్, హిందూపురం

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



చేనేతలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. అప్పుడే చేనేతలకు గిట్టుబాటు అవుతుంది. చేతి మగ్గాలు ఉన్న వారికి గత ప్రభుత్వం ఇచ్చిన నేతన్న నేస్తం రూ.24 వేలు యథావిధిగా అందించాలి. సోమందేపల్లిలో ఒకే బ్యాంకు ఉంది. మరో బ్యాంకు ఏర్పాటుకు ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలి.

– హనుమంతు, సోమందేపల్లి

హంద్రీనీవా పనులు ప్రారంభించాలి



కదిరి నియోజకవర్గంలో గాండ్లపెంట మండలంలో హంద్రీనీవా కాలువలు లేవు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాలువ ద్వారా ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసింది. అయితే ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఎత్తిపోతల పథకం పనులు త్వరిత గతిన ప్రారంభించాలి. ఈ అంశాన్ని స్థానిక శాసన సభ్యుడు అసెంబ్లీలో ప్రస్తావించి నిధులు రాబట్టాలి.

– పుల్లారెడ్డి, రైతు, వంకపల్లి, గాండ్లపెంట మండలం

ఉద్యోగావకాశాలు కల్పించాలి



వెనుకబడిన మడకశిర నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు ఎమ్మెల్యే చొరవ చూపాలి. గౌడనహళ్లి, ఆర్ అనంతపురం పంచాయతీల్లో సేకరించిన సెజ్ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి. ఈ అంశాలపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అసెంబ్లీలో మాట్లాడాలి.

– వెంకటేష్, ఆర్. అనంతపురం, మడకశిర మండలం

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి



పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమి, కృష్ణా జలాలు పుట్టపర్తిలో అందుబాటులో ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని పుట్టపర్తిలో పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలి. దీంతో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఇందుకోసం స్థానిక ఎమ్మెల్యే ఈ ప్రాంత సమస్యలు, పరిశ్రమల ఏర్పాటుకు ఇక్కడున్న పరిస్థితులను అసెంబ్లీలో చర్చించాలి.

– వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ, పుట్టపర్తి

హార్టికల్చర్ హబ్ సాధించాలి



బుక్కపట్నం రైతులు మామిడి అధికంగా సాగు చేస్తారు. సరైన మార్కెటింగ్ సౌకర్యం లేక దళారులకు తక్కువ ధరకే ఫల సాయాన్ని విక్రయిస్తూ నష్టపోతున్నారు. అందువల్ల ఇక్కడ హార్టికల్చర్ హబ్ తీసుకువచ్చి రైతుకు మేలు జరిగేలా చూడాలి. అలాగే కోల్డ్ స్టోరేజీతో పాటు మరిన్ని సదూపాయాలు కల్పించాలి. ఆ దిశగా స్థానిక ఎమ్మెల్యే సింధూర అసెంబ్లీలో గళం వినిపించాలి.

– అజయ్‌కుమార్ రెడ్డి, బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం మండలం

కలహాల కూటమి

- టీడీపీ, బీజేపీ, జనసేన నేతల మధ్య సఖ్యత కరువు
- ఒకరిపై మరొకరు విమర్శల పర్వం
- ప్రతి పనిలోనూ వాటాల కోసం ఘర్షణ
- బహిర్గతం అవుతోన్న గ్రూపు తగాదాలు
- కలసి ఉండలేమంటూ బహిరంగంగా వెల్లడి
- పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరాకు బీజేపీ నేతల దూరం
- ధర్మవరంలో కుర్చీలు విసురుకున్న 'తమ్ముళ్లు'
- హిందూపురంలో పదవుల కోసం జనసేన ఆరాటం



సాక్షి, పుట్టపర్తి

అతుకుల బొంత.. రోజూ చింత అన్న చందంగా మారింది కూటమి పార్టీల నాయకుల పరిస్థితి. ఏ రోజూ ఏం జరుగుతుందో? ఏ పార్టీ నేత ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పనులు, పదవుల విషయంలోనూ మూడు పార్టీల నాయకుల మధ్య సహకారం కరువైంది. ఫలితంగా కూటమి ప్రభుత్వంపై సొంత పార్టీల నాయకుల నుంచే విమర్శలు ప్రారంభమయ్యాయి. ఏ నియోజకవర్గంలోనూ మూడు పార్టీల నాయకులూ సఖ్యతతో ఉండటం లేదు. ఎమ్మెల్యేలకు ఒక పార్టీ నేతలు సహకరిస్తే.. మరో పార్టీ నుంచి వ్యతిరేకత వస్తోంది. నామినేటెడ్ పోస్టుల నేపథ్యంలో గ్రూపు తగాదాలు ఒక్కొక్కటిగా రచ్చకెక్కుతున్నాయి. ప్రెస్ మీట్‌లు మొదలు.. కుర్చీలు విసురుకునే వరకు అసమ్మతి రేగింది.

ధర్మవరంలో ఆలస్యంగా వెలుగులోకి..

పది రోజుల క్రితం ధర్మవరం పట్టణం టీడీపీ అధ్యక్షుడు పరిచె సుధాకర్, మరో టీడీపీ నేత పురుషోత్తం గౌడ్‌తో పాటు సుమారు 20 మంది కార్యకర్తలు బత్తలపల్లి రోడ్డులో ఉన్న బీజేపీ కార్యాలయానికి వెళ్లి ఆగమాగం చేశారు. మంత్రి సత్యకుమార్ పీఏ హరీశ్‌బాబుతో వాగ్వాదానికి దిగారు. ప్రతి కార్యక్రమానికీ తమను పిలవాలని చెప్పారు. టీడీపీ మద్దతుతోనే బీజేపీ గెలిచిందనే విషయం మరువకూడదన్న విషయాన్ని కాస్త గట్టిగానే చెప్పారు. మాటామాటా పెరగడంతో కుర్చీలు కూడా విసురుకున్నట్లు తెలిసింది. మరోవైపు ప్రతి పనిలోనూ 30 శాతం కమీషన్ కావాలని జనసేన నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా రేషన్ షాపు డీలర్లు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ, రైల్వే క్యాంటీన్, బార్లు, ఉపాధి పనుల ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల సర్దుబాటు విషయంలోనూ విభేదాలు తలెత్తినట్లు చెబుతున్నారు.

పుట్టపర్తిలో ప్రకంపనలు..

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కూటమి నియమాలను తుంగలో తొక్కుతున్నారని బీజేపీ నేతలు బహిరంగ విమర్శలు చేశారు. రెండు రోజుల క్రితం మీడియా సమావేశం నిర్వహించి.. టీడీపీ తీరును తప్పుబట్టారు. త్వరలోనే భవిష్యత్ కార్యచరణ తెలియజేస్తామని హెచ్చరించారు. విజయవాడలో ఉన్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి బీజేపీ నేతలకు ఫోన్ చేసి తాను పుట్టపర్తి రాగానే.. చర్చిస్తానని.. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని బతిమిలాడినట్లు తెలుస్తోంది.

హిందూపురంలో జనసేన పాకులాట

రేషన్ డీలర్ల విషయంలో టీడీపీ నాయకులతో జనసేన కార్యకర్తలకు విభేదాలు వచ్చాయి. హిందూపురం పట్టణం, రూరల్, లేపాక్షి, చిలమత్తూరులో మండలానికి నాలుగైదు చోట్ల తమకే రేషన్ షాపులు ఇవ్వాలని జనసేన నేతలు డిమాండ్ చేస్తున్నారు. అయితే సంఖ్యా బలం ఆధారంగా తక్కువ ఇస్తామని తెలుగు 'తమ్ముళ్లు' వాదిస్తుండటంతో సమస్య తలెత్తింది. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నప్పటికీ.. స్థానికంగా తమకు కనీస గౌరవం కూడా ఇవ్వకపోవడం ఏమిటని జనసేన కార్యకర్తలు వాపోతున్నారు. ఇక మడకశిర, కదిరి, పెనుకొండ నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో మూడు పార్టీల నేతలు ఎవరికి వారు పెత్తనం చేసేందుకు సిద్ధమయ్యారు.

సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయికి వెళ్లాలి

- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 265 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని కలెక్టర్ చేతన్ అన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు. జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 265 అర్జీలు అందగా, వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం వసతి గృహాలు, రైతు సేవా కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులను తనిఖీ చేసి సమస్యలను గుర్తించడంతో పాటు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే తమ శాఖలకు సంబంధించిన అంశాలపై అధికారులు సమీక్షించుకోవాలన్నారు. వసతి గృహాల్లో సౌకర్యాల కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీకేపల్లి వసతి గృహంలో సెప్టిక్ ట్యాంకులు క్లీన్ చేయించాలని, చిలమత్తూరులోని వసతి గృహాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని, మడకశిర బీసీ, అగళి బీసీ వసతి గృహాల్లో శానిటేషన్ మెరుగుపరచాలన్నారు. తాడిమర్రి, సోమందేపల్లి వసతి గృహాలను వెంటనే పరిశీలించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. భూ తగాదాలకు సంబంధించిన కేసుల్లో ఆయా శాఖల ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, సీపీఓ విజయ్‌కుమార్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అందిన అర్జీల్లో కొన్ని...

తనకు పుట్టపర్తి మండలం ఎనుములపల్లి సర్వే నంబర్ 424లోని 2.25 ఎకరాల భూమి ఉందని, సదరు భూమిని కుళ్లాయప్ప అనే వ్యక్తి ఆక్రమించి శనివారం చదును చేశారని ఓబుళమ్మ ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

- నల్లమాడ 2వ వార్డులో అంజినప్ప అనే వ్యక్తి రోడ్డును ఆక్రమించి మరుగుదొడ్డికి, గుంతలు తీస్తున్నారని, దీనివల్ల రస్తాకు ఇబ్బంది అవుతుందని వెంకటేష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

కరెంటు కోతలపై రైతన్న కన్నెర్ర

- అమడగూరు సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన



సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

అమడగూరు: విద్యుత్ కోతలను రైతులు నిరసించారు. సోమవారం అమడగూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చినగానిపల్లి పంచాయతీలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ఇటీవల త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, దీంతో మోటర్లు పనిచేయక సాగునీరందక పంటలన్నీ ఎండిపోతున్నాయని మండిపడ్డారు. విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులతో మోటార్లు, స్టార్టర్లు కాలి పోతున్నాయన్నారు. ప్రకృతి సహకరించకపోయినా కష్టపడి పంటలు సాగు చేస్తున్నామన్నారు. ఇక నుంచి కోతలు లేకుండా చూస్తామని, నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని విద్యుత్ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఘనంగా 'శిక్షా సప్తాహ్' వేడుకలు



నమూనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: వివిధ అంశాల్లో పట్టు సాధించడానికి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే 'శిక్ష సప్తాహ్' వేడుకలను కలెక్టర్ చేతన్ పుట్టపర్తి మండలం ఎనుములపల్లిలో సోమవారం ప్రారంభించారు. డీఈఓ మీనాక్షి, డీవైఈఓ రంగస్వామితో కలిసి పాఠశాలకు విచ్చేసిన కలెక్టర్... స్థానికంగా లభించే సామగ్రితో విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. ఆయా నమూనాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...'శిక్షా సప్తాహ్' కార్యక్రమం ఈనెల 28వ తేదీ వరకూ ప్రాతి పాఠశాలలోనూ నిర్వహించాలన్నారు. విద్యార్థులు వివిధ అంశాలపై పట్టు సాధించడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశ పెట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా 'శిక్ష సప్తాహ్' కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా పునాది అభ్యసన, భాషపై నైపుణ్యం, వివిధ క్రీడల్లో పోటీలు, భిన్నత్వంలో ఏకత్వం, సాంస్కృతిక కార్యక్రమాలు, డిజిటల్ విద్య, పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, సామాజిక భాగస్వామ్యంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నూతన విద్యా విధానాన్ని ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల అందజేత



దివ్యాంగులకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: దివ్యాంగులనే భావనను పక్కన పెట్టి ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలని దివ్యాంగ విద్యార్థులకు కలెక్టర్ చేతన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాలో అర్హులైన దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను ఆయన అందజేసి, మాట్లాడారు. జేసీ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, దివ్యాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ రమణ, సీఆర్‌ఓ రామాంజనేయులు, నాగమణి, దివ్యాంగ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర అధ్యక్షులు షఫీ, కో–ఆర్డినేటర్ హరినాథరెడ్డి, సభ్యులు గజేంద్ర, గంగాదేవి, కేశవమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఒక్కో ల్యాప్‌టాప్ విలువ రూ.50 వేలు ఉంటుందని, వీటిలో చూపులేనివారు సైతం వినియోగించేలా సాఫ్ట్‌వేర్ రూపొందించి ఉందన్నారు. జాగ్రత్తగా వినియోగించుకుని చదువుల్లో అందరికంటే ముందంజలో నిలవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

'పోలీసు స్పందన'కు 36 వినతులు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: స్థల, భూ వివాదాలను కోర్టుల ద్వారా పరిష్కరించుకోవాలని అర్జీదారులకు ఎస్పీ రత్న సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 36 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా అర్జీలు స్వీకరించారు. సమస్య తీవ్రతను అడిగి తెలుసుకుని, చట్టపరిధిలోని సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత స్టేషన్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా మలేరియా అధికారి కుల్లాయప్పనాయక్



నీటి తొట్టెలను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

పుట్టపర్తి అర్బన్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా మలేరియా అధికారి కేసీ కుల్లాయప్పనాయక్ తెలిపారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలోపై దోమకాటు వ్యాధుల నివారణపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. మురుగు నీటి తొట్టెలను శుభ్రం చేయించారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ప్రజలు జ్వరాల బారిన పడకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. దోమ తెరలను వాడడం అన్నింటా సురక్షితమని పేర్కొన్నారు. సాయంకాలం వేపాకు పొగ వేయాలన్నారు. అనంతరం స్థానికులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నగేష్, మలేరియా అధికారి లక్ష్మీనాయక్, ఎస్‌యూఓ రమణయ్య, వెంకటేష్, సూపర్‌వైజర్ వెంకటరమణ, సిబ్బంది అపర్ణ, రాజశేఖర్, సెక్రెటరీ మూర్తి, ప్రమీల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసమే హతమార్చారు!

- ఆటో డ్రైవర్ హత్యకేసులో వీడిన మిస్టరీ
- నలుగురు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబ్‌జాన్ సైదా

ధర్మవరం రూరల్: ఆస్తి కోసమే ఆటో డ్రైవర్‌ను దారుణంగా హతమార్చారని డీఎస్పీ బాబ్‌జాన్ సైదా తెలిపారు. ఆటో డ్రైవర్ చాకలి సూర్యనారాయణ హత్యకేసులో మిస్టరీని పోలీసులు ఛేదించి, నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. సోమవారం రాత్రి ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. రెండు రోజుల క్రితం ధర్మవరం మండలం సీసీ కొత్తకోట వద్ద ఉన్న ఉడతరాళ్ల గుట్ట వద్ద వెల్దుర్తి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చాకలి సూర్యనారాయణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణను వేగవంతం చేశారు. సూర్యనారాయణ అత్త సాలమ్మకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కుమార్తె కృష్ణవేణిని తాడిమర్రికి చెందిన సూర్యనారాయణ 22 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. పెళ్లి అనంతరం ఇల్లరికం వచ్చిన సూర్యనారాయణ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సాలమ్మ భర్త చనిపోవడంతో ఆస్తి మొత్తం ఆమె పేరుపై మార్చారు. ఈ ఆస్తి విషయంగా సాలమ్మ చిన్న కొడుకు మల్లికార్జున, కుమార్తె కృష్ణవేణి కుటుంబాల మధ్య తగాదాలు నెలకొన్నాయి. రెండు కుటుంబాల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకునేవి. వారం రోజుల క్రితం మల్లికార్జునతో సూర్యనారాయణ గొడవపడి ఆస్తి జోలికి వస్తే చంపుతానని బెదిరించాడు. దీంతో కక్ష పెంచుకున్న మల్లికార్జున... మొత్తం ఆస్తిని ఎలాగైనా దక్కించుకోవాలంటే బావ సూర్యనారాయణను హతమార్చడం ఒక్కటే మార్గమని భావించాడు. అనుకున్నదే తడవుగా సూర్యనారాయణ హత్యకు పథకం రచించాడు. ఈ నెల 19న రాత్రి 10 గంటల సమయంలో వెల్దుర్తి క్రాస్ వద్ద తన కుమారుడు రాము, అల్లుడు రాజు, సమీప బంధువు లక్ష్మీనారాయణతో కలసి మల్లికార్జున కాపు కాచాడు. ఆటో నడుపుకుంటూ సూర్యనారాయణ అక్కడకు చేరుకోగానే అడ్డుకుని మాట్లాడుకుందామంటూ అదే ఆటోలో ఉడుతరాళ్ల పొలం వద్దకు పిలుచుకెళ్లారు. నిర్జన ప్రదేశంలోకి చేరుకోగానే సూర్యనారాయణపై మూకుమ్మడిగా ఇనుప రాడ్‌తో దాడి చేశారు. మృతి చెందినట్లు నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి జారుకున్నారు. ఈ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో సోమవారం ఉదయం నిందితులను పోతులనాగేపల్లి క్రాస్ వద్ద అరెస్ట్ చేసి, హతుడి సెల్‌ఫోన్‌తో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన డీఎస్పీ బాబ్‌జాన్ సైదా, రూరల్ సీఐ ఆరోహణ రావు, రూరల్ ఎస్‌ఐ నరేంద్ర, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

వ్యక్తి దుర్మరణం



ప్రసాద్ మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య

మడకశిర రూరల్: ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర మండలం బుళ్లసముద్రం గ్రామానికి చెందిన ప్రసాద్ (35) సోమవారం నడుచుకుంటూ ప్రధాన రోడ్డు దాటుతున్న సమయంలో హిందూపురం వైపు నుంచి వస్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. ఘటనలో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న భార్య, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని ప్రసాద్ మృతదేహం పడి రోదించిన తీరు చూపరులను కంట తడి పెట్టించింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మనోహర్ తెలిపారు. కాగా, ప్రసాద్ మృతి చెందిన విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్పందించి బాధిత కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. వ్యక్తిగత సహాయకుడి ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేయించారు.

అనంత సమగ్ర ఉద్యోగుల ఖాతాల్లో జీతం

- మే, జూన్ నెలలకు సంబంధించి ఈ నెల 16న జీతాల బడ్జెట్ విడుదల
- తీరిన అనంతపురం జిల్లా ఉద్యోగుల సమస్య
- శ్రీసత్యసాయి జిల్లా ఉద్యోగులకు మొండిచెయ్యి
- అధికారుల తీరుపై మండిపడుతున్న పొరుగు జిల్లా ఉద్యోగులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులకు జీతాలు పడ్డాయి. బకాయి ఉన్న రెన్నెళ్ల జీతాలు సోమవారం ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో అధికారులు జమ చేశారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి మే, జూన్ జీతాల బడ్జెట్ ప్రభుత్వం విడుదల చేసినా ఉమ్మడి జిల్లా సమగ్ర శిక్ష అధికారుల అలసత్వం కారణంగా ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదు. ఇదే అంశంపై 'జీతమో రామచంద్రా' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై అనంత సమగ్ర శిక్ష అధికారులు స్పందించారు. లోపాలను సరిదిద్దుకుని ఆగమేఘాలపై ఫైలు సిద్ధం చేసి ఆమోద ముద్ర వేసి బిల్లులను బ్యాంకుకు పంపారు. దీంతో సోమవారం ఉదయమే ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో జీతాలు జమ అవుతూ వచ్చాయి. సాయంత్రానికి అందరి ఉద్యోగులకు జీతాలు పడ్డాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో సమగ్రశిక్ష కింద 2,800 మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. మే, జూన్ నెలలకు సంబంధించి జీతాల బడ్జెట్ ఈనెల 16న ప్రభుత్వం విడుదల చేసింది. అనంతపురం జిల్లాకు రూ.6.57 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు రూ. 6.46 కోట్లు విడుదలయ్యాయి. అనంతపురం జిల్లా ఉద్యోగుల సమస్యకు సోమవారంతో తెరపడినా... శ్రీసత్యసాయి జిల్లా ఉద్యోగులకు జీతాల జమ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వీడలేదు. కారణం ఏదైనా ప్రభుత్వం వారం కిందటే జిల్లాకు బడ్జెట్ విడుదల చేసినా నేటికీ ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయకపోవడం గమనార్హం. దీనిపై ఆ జిల్లా ఉద్యోగులు మండిపడుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ స్పందించి తమ జీతాలు బిల్లులు పెట్టేలా ఆదేశాలు జారీ చేయాలని ఆ జిల్లా ఉద్యోగులు కోరుతున్నారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాల్లో కొందరు ఎంఈఓలు స్టూడెంట్ కిట్లకు సంబంధించిన రవాణా బిల్లులు కూడా మంజూరు చేయలేదని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వాపోతున్నారు.

అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకం



విద్యార్థిని అర్చితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రగతి, తదితరులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని అర్చిత... అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి అభినందించి, మాట్లాడారు. ఆదివారం హైదరాబాదులోని కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని బంగారు పతకం సాధించడం గర్వంగా ఉందన్నారు. అర్చితను ఆదర్శంగా తీసుకుని విద్యార్థినులందరూ మార్షల్ ఆర్ట్స్ అభ్యసించాలని సూచించారు. మహిళలకు రక్షణ కరువైన ప్రస్తుత తరుణంలో ఆత్మరక్షణ విద్య నేర్చుకోవడం అమ్మాయిలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తమ కళాశాలలోని విద్యార్థినులకు ఉచితంగా శిక్షణ ఇచ్చిన రామచంద్రకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే అర్చితకు ఆర్థిక సహకారం అందజేసిన ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు విద్య, సభ్యులు తుల్జాబాయి, భువన, అశ్వత్థలక్ష్మి, పద్మ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేషులు, విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ యశోద, అధ్యాపకులు డాక్టర్ రవి నాయక్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతపురం సిటీ: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి (45) మృతిచెందాడు. ఆదివారం రాత్రి అనంతపురంలోని రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో శరీరం పూర్తిగా ఛిద్రమైపోయింది. జీఆర్‌పీ ఎస్‌ఐ విజయకుమార్ పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడు నీలం రంగు టీ షర్ట్, తెల్లరంగు లుంగీ ధరించాడు. మిస్సింగ్ కేసుల్లో సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని అనంతపురం రైల్వే పోలీసులు కోరారు.

ఇన్‌చార్జ్ సీఈఓగా ప్రభాకర్‌రావు



జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇన్‌చార్జ్ సీఈఓ ప్రభాకర్‌రావు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేసి, జెడ్పీకి మంచి పేరు తీసుకురావాలని ఇన్‌చార్జ్ సీఈఓ ప్రభాకర్‌రావుకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. ఇప్పటి వరకూ సీఈఓగా పని చేసిన వైఖోమ్ నిదియాదేవిని అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. ఆమె ఆదివారం రాత్రే రిలీవ్ అయ్యారు. పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా డీపీఓ ప్రభాకర్‌రావుకు ఇన్‌చార్జ్ సీఈఓ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించి, చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.

'పురం' జిల్లాస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



తొలగించిన కణతిని చూపుతున్న ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు

హిందూపురం టౌన్: స్థానిక జిల్లాస్పత్రిలో వైద్యులు సోమవారం అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఓ మహిళ కడుపులో ఉన్న 3 కిలోల కణతిని తొలగించారు. వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్, గైనకాలజిస్ట్ బాబా బుడేన్ వెల్లడించారు. హిందూపురంలోని మోతుకుపల్లికి చెందిన కల్పన కొన్ని రోజులుగా పొట్టవాపు ఇబ్బందితో బాధపడుతుండేది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో చివరకు జిల్లాస్పత్రికి వచ్చింది. వైద్య పరీక్షల అనంతరం ఆమె కడుపులో పెరుగుతున్న కణతిని వైద్యులు గుర్తించి, బాధితురాలి కుటుంబసభ్యుల ఆమోదంతో సోమవారం డాక్టర్ బాబా బుడేన్, లక్ష్మీరామ్‌నాయక్ ఆధ్వర్యంలో శస్త్రచికిత్స నిర్వహించారు. మూడు కిలోల బరువున్న కణతిని తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడంగా ఉంది. అరుదైన శస్త్రచికిత్సలకు చాలా మంది బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు వెళుతుంటారని, ఎంతో ఖర్చుతో కూడుకున్న ఈ శస్త్రచికిత్సను జిల్లాస్పత్రిలో పూర్తి ఉచితంగా అందజేసినట్లు వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్సలో వైద్యులతో పాటు పాల్గొన్న సిబ్బంది సునీత రాణి, సుమలత, నాగరాజును ఈ సందర్భంగా డాక్టర్ రోహిల్‌కుమార్ అభినందించారు.

యువతి బలవన్మరణం



మృతురాలు దీపిక

హిందూపురం: మండలంలోని చౌళూరు గ్రామానికి చెందిన నరసింహమూర్తి కుమార్తె దీపిక (25) ఆత్మహత్య చేసుకుంది. కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న ఆమెకు పెళ్లి సంబంధాలు ఏవీ కుదరడం లేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె ఆదివారం రాత్రి ఆమె పురుగుల మందు తాగింది. విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే కర్ణాటకలోని గౌరీబిదనూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై హిందూపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



నరేంద్ర (ఫైల్)



అశోక్ (ఫైల్)

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం మునిమడుగు గ్రామానికి చెందిన అశోక్ (21), నరేంద్ర(21) వ్యక్తిగత పనిపై సోమవారం గుట్టూరుకు వెళ్లారు. పని ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు... గుట్టూరు గ్రామ శివారులోకి చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు వెంటనే పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అప్పటికే అశోక్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నరేంద్రకు ప్రథమ చికిత్స అనంతరం కియా ఎస్‌ఐ రంగడు తన వాహనంలోనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే నరేంద్ర సైతం మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కియా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుల్లో నరేంద్ర బెంగళూరులో డ్రైవర్‌గా, అశోక్ కియా అనుబంధ పరిశ్రమలో ప్లంబర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మొహర్రం సందర్భంగా నరేంద్ర ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు.

విష జ్వరంతో విద్యార్థిని మృతి



మాన్య(ఫైల్)

అమరాపురం: మండల పరిధిలోని ఉదుగూరు గ్రామానికి చెందిన ఓ విద్యార్థి విషజ్వరంతో మృతి చెందింది. ఉదుగూరుకు చెందిన పాపేగౌడ కుమార్తె మాన్య (14) కర్ణాటక రాష్ట్రంలోని హిరియూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. జ్వరంతో బాధపడుతున్న మాన్యను నాలుగు రోజుల క్రితం తల్లిదండ్రులు స్వగ్రామానికి తీసుకు వచ్చారు. అమరాపురం, హిరియూరు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో సోమవారం తుమకూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న మాన్య సోమవారం సాయంత్రం మృతి చెందింది.

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలి



సభ్యత్వం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

తలుపుల: జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ తక్షణమే చేపట్టి పనిభారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాదరెడ్డి డిమాండ్ చేశారు. తలుపుల మండలం ఓబులరెడ్డిపల్లి, ఉబ్బరవాండ్లపల్లి, తలుపుల, నూతనకాల్వ గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదును సోమవారం ఆయన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ప్రాథమిక పాఠశాలల విలీన ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. మధ్యంతర భృతిని ప్రకటించడంతో పాటు పీఆర్సీ బకాయిలు చెల్లించాలన్నారు. అమ్మకు వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకే వర్తింపజేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్ రమణానాయక్, మండల అధ్యక్షుడు ఫయాజ్, ఎన్పీకుంట మండల కార్యదర్శి వీరమహేశ్వర, ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులు.... యువకుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న షాకీర్

హిందూపురం: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడి కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... హిందూపురంలోని అహమ్మద్ నగర్‌కు చెందిన షాకీర్ కొన్నేళ్ల క్రితం వ్యాపారం నిమిత్తం చౌడేశ్వరి కాలనీకి చెందిన ఓ వడ్డీ వ్యాపారి వద్ద అప్పు చేశాడు. వారం వడ్డీ కావడంతో చూస్తుండగానే భారం పెరిగి రూ.3 లక్షలకు పైగా చేరుకుంది. ఇప్పటి వరకూ ప్రతి వారం కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుంటూ వచ్చారు. అసలు అలాగే మిగిలిపోయింది. ఈ క్రమంలో ఒక్కసారిగా మొత్తం డబ్బు చెల్లించాలని వడ్డీ వ్యాపారి నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. ఆదివారం తన కుటుంబసభ్యులతో కలసి షాకీర్ పెనుకొండ దర్గాకు వెళ్లి తిరిగి వస్తున్న వడ్డీ వ్యాపారి, ఆయన కుటుంబసభ్యులు ఫోన్ చేసి పిలిపించుకున్నారు. అనంతరం పట్టణం బయటకు పిలుచుకెళ్లి తమ అనుచరులతో దారుణంగా కొట్టించారు. దెబ్బలకు తట్టుకోలేక షాకీర్ అపస్మారక స్థితికి చేరుకోవడంతో అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. విషయాన్ని గమనించిన స్థానికులు సపర్యలు చేయడంతో కోలుకున్న ఆయన నేరుగా ఇంటికి చేరుకుని గదిలోకెళ్లి చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కాపాడి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. కాగా, వడ్డీ వ్యాపారి వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో పాటు భౌతికంగా దాడి చేయడంతో జీవితంపై విరక్తి చెంది తాను ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు పోలీసుల ఎదుట బాధితుడు వాంగ్మూలం ఇచ్చాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.